# సినిమా ప్రస్థానం

-పెద్దాడ సూర్యనారాయణమూర్తి

"నటీనటులు కావలెను" అనే ప్రకటన చూసి ఎప్పుడెప్పుడు హీరో అవుదామా అని ఎదురుచూస్తూ ఆలోచనల్లో గడిపే వెంగళ్రావు ఎగిరి గంతేద్దామనుకున్నాడు. కానీ అతని భారీ శరీరం సహకరించక ఊరుకున్నాడు. బోలెడు ఆస్తి ఉంది. తిని కూర్చోవడమే తప్ప వేరే పని లేదు. మరి శరీరం పెరగక చస్తుందా? ఏమైనా సరే హీరో వేషం సంపాదించాలి అనుకుంటూ తండ్రి దగ్గరకు వెళ్లాడు.

"నాన్నా! నేను హైదరాబాద్ వెళ్లాలి. ఒక యాభైవేలు ఇవ్వు" అన్నాడు.

"ఎందుకురా నీకంత డబ్బు?" అంటూ గుబురు మీసాలు దువ్వుకుంటూ, తాపీగా చుట్ట కాల్చుకుంటూ అడిగాడు తండ్రి.

"నేను హీరో అవ్వాలా వద్దా?" అడిగాడు హీరోలా ఫోజిస్తూ.

"నిన్ను హీరోగా ఎవరు తీసుకుంటార్రా? చిన్నప్పటినుంచి నేను హీరోనవుతా, హీరోనవుతా అంటావుగానీ నీ పర్సనాలిటీని ఒక్కసారైనా అద్దంలో చూసుకున్నావా?" అడిగాడు తండ్రి.

"ఇప్పుడున్న హీరోలెవ్వరూ నాకంటే గొప్పగా ఏమీలేరుగానీ ముందు డబ్బివ్వు నేను వెళ్లాలి" అన్నాడు వెంగళ్రావు.

"సరే..పదివేలు తీసుకుని వెళ్లు. నువ్వు హీరోగా సెలెక్ట్ అయితే యాభై వేలేం ఖర్మ పది లక్షలైనా పెట్టుబడి పెడతాను. ఈ ఊర్లో నా పరువు కూడా పెరిగిపోతుంది కదా అప్పుడు" అన్నాడు తండ్రి.

తండ్రి ఇచ్చిన పదివేలు పట్టుకుని నగరానికి బయలుదేరాడు వెంగళ్రావు ఆనందంగా.

వెంగళ్రావు తండ్రికి ఇరవై ఎకరాల పొలం, తోటలు ఉన్నాయి. కొడుక్కి ఎలాగూ చదువురాలేదు, సినిమా పిచ్చి ఉంది. పోనీ సినిమాల్లోకైనా పంపించాలని ఉంది తండ్రికి. కానీ కొడుకు భారీ కాయం చూసి ఊరుకున్నాడు.

అసలా ఆలోచన కూడా ఎందుకు కలిగిందంటే ఒకసారి సినిమా వాళ్లు షూటింగ్‌కని వాళ్ల ఊరుకొచ్చి వాళ్లింట్లో బస చేసారు. అప్పుడు వెంగళ్రావు సినిమా ఛాన్స్ గురించి అడిగితే హైదరాబాద్ పంపించండి చూద్దాం అన్నాడు దర్శకుడు. అంతేకాక ఆ సినిమాలో వందమంది ఉండే సీనులో వెనకెక్కడోనిలబడి కెమెరా అటుగా తిప్పినప్పుడు వెంగళ్రావు కూడా పడడం జరిగింది. ఆ వంకతో ఆ ఊళ్లో వాళ్లందరు ఆ సినిమాని చాలాసార్లు చూడడం జరిగింది. అప్పట్నుంచీ వెంగళ్రావుకి సినిమా పిచ్చి బాగా పట్టుకుంది.

★★★

"సార్! మీరు మార్కాపురంలో మా వీధిలో మా ఇంట్లో తింగరోడు సినిమా షూటింగ్ తీసేరు కదండి. ఆ ఇంటి వాళ్ల అబ్బాయినండి" అన్నాడు వినయంగా వెంగళ్రావు డైరెక్టర్ ముందు నిలబడి.

"ఐతే ఏంటి? మేము చాలా ఊళ్లు తిరుగుతాము. అన్నీ గుర్తుంటాయా?" అన్నాడు డైరెక్టరు విసుగ్గా.

"సార్! నటీనటులు కావాలని ప్రకటన ఇచ్చారుకదా"

"అవును ఇచ్చాం. అయినా నీవు ఇంత లావుగా ఉన్నావు. ఏ వేషానికి వచ్చినట్లు?" ప్రశ్నించాడు డైరెక్టరు.

"నేను హీరో వేషం కోసం వచ్చాను సార్. మీరు నాకు ఏదోలా హీరో వేషం ఇవ్వాలి సార్"

"హీరో వేషానికి నువ్వు సరిపోవు. అయినా అదే ఇవ్వాలంటే ఆషామాషీ కాదు. పదిలక్షలు తెస్తావా?" అన్నాడు హాస్యంగా డైరెక్టర్.

"నిజంగానా సార్! మా నాన్న కూడా పదిలక్షలు ఇస్తానన్నాడు సార్ హీరోనయితే. నేను తెస్తాను. ముందు కరెక్టుగా చెప్పండి సార్" అన్నాడు.

"సరే నువ్వు వెళ్లి మీ నాన్నతోసహా పదిలక్షలు డబ్బు పట్టుకుని వచ్చేయ్. నీకు హీరో వేషం ఖరారు" అన్నాడు డైరెక్టర్ డబ్బు తెచ్చినప్పుడు చూద్దాంలే అనుకుంటూ.

"అలాగే సార్. రెండురోజుల్లో వస్తాను" అంటూ సినిమా ఆఫీసునుండి బయలుదేరాడు ఊరికి వెంగళ్రావు.

ఇంతలో అటువైపుగా ఒక అమ్మాయి సినిమా ఆఫీసులోకి రావడం చూసాడు వెంగళ్రావు. చాలా సన్నగా ఉందా అమ్మాయి. ఈ అమ్మాయే నా హీరోయిన్ అవుతుందా? అనుకుంటూ బయటకు కదిలాడు.

"సార్" అంటూ నమస్కరిస్తూ పలికింది ఆ అమ్మాయి డైరెక్టర్‌గారిని చూసి.

"ఏం కావాలి?" అన్నాడాయన.

"నా పేరు నిర్మల. మీ సినిమాలో హీరోయిన్ వేషం కావాలి సార్" అంది తన మేకప్ అంతా చూపిస్తూ.

"అమ్మాయి... నువ్వు మరీ సన్నగా ఉన్నా నీ ముఖంలో కళ వుంది" అంటూ పరిశీలనగా చూస్తూ "నీకు హీరోయిన్ వేషం కావాలంటే మరి పెట్టుబడి పెట్టాలి. నీవు అందుకు సిద్ధమా?" అంటూ ప్రశ్నించాడు డైరెక్టర్.

"ఎంత డబ్బు పెట్టాలి సార్" అడిగింది.

"నువ్వు ఎంత తేగలవు చెప్పు"

"నేను పదిలక్షలవరకు తేగలను. మీరు నాకే హీరోయిన్ ఛాన్స్ ఇవ్వాలి"

"ఆ డబ్బు తీసుకుని వస్తే నీకే ఆ వేషం పక్కా. కానీ రెండురోజుల్లో వచ్చేయాలి. ఎందుకంటే నీకంటే ఎక్కువ పెట్టుబడి పెట్టడానికి ఇక్కడికి చాలామంది వస్తున్నారు'' అన్నాడు డైరెక్టర్.

"అలాగే. నేను రెండురోజుల్లో తెస్తాను. ఇంకెవ్వరికీ ఆ ఛాన్స్ ఇవ్వకండి సార్'' అంటూ వెళ్లిపోయింది నిర్మల.

★★★

రెండురోజుల తరువాత వెంగళ్రావు, అతని తండ్రి కలసి సినిమా ఆఫీసుకి డబ్బుతోసహా వచ్చారు. డైరెక్టర్ని కలసి వెంగళ్రావు తండ్రి ఆ డైరెక్టర్ని అంతకుముందే వాళ్ల ఇంటివద్ద చూసి ఉండడంవల్ల బోగస్ కాదని తెలుసుకుని డబ్బు ఇచ్చేసాడు డైరక్టర్‌కి.


"మీరు వెళ్లండి మీ అబ్బాయిని వదిలేసి. నేను కథ చెప్పాలి'' అన్నాడు డైరెక్టర్.

"సరే సార్. నేను మళ్లీ వస్తాను. బాగా జాగ్రత్తగా డైరెక్టర్‌గారు చెప్పినట్లు నడుచుకో'' అంటూ బయలుదేరాడు వెంగళ్రావు తండ్రి.




ఇంతలో హీరోయిన్ కాబోయే నిర్మల కూడా డబ్బు తెచ్చి ఇవ్వడంతో "సరేనమ్మా నువ్వే మా సినిమాలో హీరోయిన్. కూర్చోండి ఇప్పుడే వచ్చి కథ చెప్తాను'' అంటూ డబ్బు లోపల పెట్టడానికి వెళ్లాడు డైరెక్టర్ తన అసిస్టెంట్‌తో కలసి.

"సార్! ఇంత లావు హీరోతో, ఇంత సన్నటి గాలికి ఎగిరిపోయేలా ఉన్న హీరోయిన్‌తో మనం ఏ సినిమా తీస్తాం సార్'' అడిగాడు అసిస్టెంట్ అనుమానపడుతూ.



## ఉదయ్‌కిరణ్ ఆశ

'చిత్రం', నువ్వు-నేను', మనసంతా నువ్వే' చిత్రాలతో ఒక్కసారిగా తారాపథంలోకి దూసుకుపోయిన ఉదయ్‌కిరణ్ కెరీర్ ఆ తరువాత అమాంతం క్రిందకు దిగిపోయింది. చిత్రాల ఎంపికలో అతను తీసుకున్న నిర్ణయాలవల్ల ఎంతగానో నష్టపోయాడు. తమిళ్‌లో కూడా అదృష్టం కలసి రాక తిరిగి టాలీవుడ్‌కు వచ్చేసాడు. ప్రస్తుతం ఉదయ్‌కిరణ్ ఆశలన్నీ 'నువ్వెక్కడుంటే నేనక్కడుంటా' చిత్రం మీదనే పెట్టుకున్నాడు. ఈ చిత్రం తప్పకుండా విజయం సాధిస్తుందని, తనకు పూర్వ వైభవం తీసుకు వస్తుందనుకుంటున్నాడు. ఆల్ ది బెస్ట్ ఉదయ్!




"ఉండు చెప్తాగా. చూస్తూ ఉండు. నాతో రా'' అన్నాడు, లోపల డబ్బు పెట్టి ఇద్దరూ బయటకువచ్చారు.

"మీ పేర్లేమిటన్నారు?'' అడిగాడు వాళ్లిద్దర్నీ.

"నా పేరు వెంగళ్రావు సార్''

"నా పేరు నిర్మల సార్''

"ఏమి బాగున్నాయయ్యా ఆ పేర్లు? వెంటనే మార్చేసుకోండి''

"నా పేరు నిర్మల అని పెట్టుకుంటే బాగుండదు కదండీ. ఆ అమ్మాయి నా పేరు పెట్టుకున్నా బాగుండదు సార్'' అన్నాడు వెంగళ్రావు నసుగుతూ.

"నేను మార్చుకోమన్నది మీ పేర్లు ఒకరివి ఒకరికి కాదు. మీ ఇప్పటి పేర్లు. నీ పేరు రాజ్, నీ పేరు మాయ అని పెట్టేసుకోండి'' అన్నాడు డైరెక్టర్.

"సరే సార్. కథ చెప్పండి'' అన్నాడు కాబోయే హీరో హీరోయిన్లు.

"కథేముంది పాత కథే. కానీ చాలా హిట్టు. దేవదాసు సినిమా పేరు.''

"దేవదాసు వన్, టూ, త్రీ అని చాలా సినిమాలు వచ్చాయి కదా సార్. మళ్లీ అదేనా?'' అన్నాడు వెంగళ్రావు సందేహంగా, నిరుత్సాహంగా.

"ఓకే... కథ నచ్చలేదా? అయితే సినిమా మానేద్దాం సరేనా'' అన్నాడు డైరెక్టర్.

"వద్దు సార్. మీ ఇష్టం. నువ్వు మధ్యలో అడ్డుపడకు'' అంటూ గదిమింది హీరోయిన్ సావిత్రిలా ఊహించుకుంటున్న ఆ అమ్మాయి వెంగళ్రావుతో.

"అయినా దేవదాసు ఒక కళాఖండం. అందుకే మీలాంటి కళాకారులతో మళ్లీ తీస్తా. కానీ...'' అంటూనే మధ్యలో ఆగిపోయాడు డైరెక్టర్.

"చెప్పండి సార్'' అన్నారు ఎంతో గొప్ప కళాకారుల్లా ఫీలైపోతూ.

"ఒక సమస్య ఉంది''

"ఏమిటి చెప్పండి'' ఆత్రుతగా అడిగారు ఇద్దరూ ఒకేసారి.

"మీ ఇద్దరూ దేవదాసు సినిమా చూసే వుంటారు చాలాసార్లు. అవునా?'' అని ప్రశ్నించాడు డైరెక్టర్.

"అవును సార్. చాలాసార్లు చూసాము'' అన్నారు ముక్తకంఠంతో.

"అయితే అందులో నాగేశ్వరరావు బక్కగా చిక్కి శల్యమైపోయాడు పార్వతి కోసం, ప్రేమకోసం. అవునా?''

"అవును సార్'' అన్నాడు వెంగళ్రావు ఉరఫ్ రాజ్.

"నువ్వు ఎలా వున్నావు? నువ్వు మన గుమ్మంలోనే పట్టక అడ్డంగా నడిచి రావడం చూసాను. మరి ఎలాగా అని ఆలోచిస్తున్నాను'' అంటూ సందేహంగా చూసాడు డైరెక్టర్.

"లేదు సార్. నేను రెండునెలలు తిండి మానేసి సన్నగా అయిపోతాను. సార్! నాదొక చిన్న డౌటు. నాగేశ్వరరావుగారు సినిమా చివర్లో కదా సన్నగా అయింది. మరి ముందు పార్ట్ ఇప్పుడు తీసేస్తే...?'' నసిగాడు వెంగళ్రావు డైరెక్టర్‌కి కోపం వస్తుందేమో సలహా చెప్తే అనుకుంటూ.

"నువ్వు చెప్పేది కరక్టేనయ్యా. కానీ చివరి సీన్ హీరోతో ముందు చేయాలి. అప్పుడే సినిమా హిట్టు. అయినా ముందర సినిమా అంతా చిన్న పిల్లాడిగా ఉన్నప్పుడిదికదా. అది చిన్న కుర్రాళ్లతో చేయించేస్తాను. నీవు లావు తగ్గేలోపు సినిమా సగం అయిపోతుంది. మిగిలినది నీవు సన్నగా అయినప్పుడు తీస్తాను''

"సరే సార్. మీరు చెప్పినట్లే. సినిమా హిట్టు కావడం ముఖ్యంకదా'' అన్నాడు వెంగళ్రావు.

"అమ్మాయి! నువ్వు మరీ గాలికి ఎగిరిపోయేలా ఉన్నావు. దేవదాసు సినిమా నువ్వు కూడా చూసావుకదా. అందులో సావిత్రి ఎలా ఉంది.. ఆమె ఎంత లావుగా వుందో అంత లావు అవ్వాలి. తెలిసిందా? దేవదాసు సినిమా

ఒక వందసార్లు చూసి వస్తే నీ పోర్షన్ కూడా స్టార్ట్ చేస్తాను. నువ్వు కూడా రెండు నెలల్లో తిరిగిరా'' అన్నాడు డైరెక్టర్ నిర్మలతో.

"అలాగే సార్. రోజుకు ఐదుపూటలా తిని లావు అయి వస్తాను సార్'' అంది తను హీరోయిన్ అయిపోయినందుకు సంతోషిస్తూ.

"ఈలోగా చిన్న అమ్మాయితో బాల్యం మొత్తం కంప్లీటవుతుంది. వెళ్లి రామ్మా''అంటూ ఇద్దరి వైపు తిరిగి "ఇంకో విషయం. నీవు సన్నగాను, నీవు లావుగానూ అయి, వచ్చేటప్పుడు ఇంకో పదిలక్షలు ఇవ్వడానికి రెడీ చేసుకోండి. వెళ్లిరండి'' అన్నాడు డైరెక్టర్ ఇద్దరినీ ఉద్దేశించి.

"అలాగే సార్'' అంటూ ఊహల్లో తేలిపోతూ వెనుదిరిగారు.

"ఒక డౌట్ సార్ డైరెక్టర్‌గారూ'' వెనక్కివచ్చి అడిగాడు వెంగళ్రావు.

"ఏమిటయ్యా నీ డౌటు?''

"సార్! దేవదాసు సినిమాలో చివరి సీన్‌లో కుక్క కూడా వుంటుందికదా సార్?''

"వుంటుంది. డౌటెందుకు?''

"కాదు సార్. మా ఇంట్లో మా కుక్క ఉంది సార్. అది నాకు బాగా అలవాటు అయింది కాబట్టి దానినే మన సినిమాలో వాడుకుంటే...?'' అంటూ వెంగళ్రావు పూర్తి చేసేలోపు-

"నీ ఇష్టం వచ్చినట్లు మీ కుక్కను ఎలా వాడుకుంటామయ్యా? ఎందుకంటే మా కుక్కకి వేషం ఇవ్వండి, మా కుక్కకి వేషం ఇవ్వండి రెండులక్షలు ఇస్తాం అంటూ మొన్ననే ఒకరిద్దరు వచ్చి వెళ్లారు తెలుసా?'' అన్నాడు డైరెక్టర్ తెలివిగా.

"సార్! మా కుక్కకు వేషం ఇవ్వండి. నేను మూడు లక్షలు ఇస్తాను'' అన్నాడు వెంగళ్రావు.

"సరే. దాని ఫోటో ఒకటి, ఒక లక్ష డబ్బు తీసుకురా. మీ కుక్కకే వేషం ఖాయం చేద్దాంలే'' అనగానే వెంగళ్రావు తెగ సంబరపడిపోయాడు.

"కానీ ఒక్క విషయం'' అంటూ డైరెక్టర్ మొదలుపెట్టగానే ఏమి చెబుతాడో అని కలవరపడిపోయాడు.

"చెప్పండి సార్'' అన్నాడు.

"ఏమీలేదు. మీ కుక్కకి ఇన్నాళ్లు మీ ఇంటి తిండి, బిస్కెట్లు అన్నీ ఇస్తూ జాగ్రత్తగా పెంచుకున్నారు.అవునా?''

"అవును సార్. దాని కడుపు కూడా మాడ్చేయమంటారా? అది కూడా సన్నగా అవ్వాలా?''

"అదికాదయ్యా... మన దేవదాసు సినిమాలో వేషం వేసే కుక్క వీధి కుక్క అవునా?

"అవును సార్''

"అందుకే నువ్వు ఇంటికెళ్లిన దగ్గర నుంచి మీ కుక్కని వీధిలోకి వదిలేసి అడ్డమైన గడ్డి తినిరానీ పర్లేదు. అప్పుడు అది వీధికుక్క వేషంలో బాగా సూటవుతుంది. ఏమంటావ్?'' అన్నాడు డైరెక్టర్.

"అవును సార్. అందుకే మీరు డైరెక్టర్ అయ్యారు సార్'' అంటూ తెగ పొగిడాడు.

"వెళ్లు రాజ్. వెళ్లి నీ ప్రాక్టీస్‌లో నువ్వు ఉండు. కుక్క ఫొటో, డబ్బు మరచిపోకు'' అంటూ పంపించివేసాడు వెంగళ్రావుని.

'మా ఊళ్లో అందరూ నన్నే పొగిడేస్తారు. నేను హీరో అయిపోవడమే కాకుండా మా కుక్కకి కూడా వేషం ఇప్పించా మరి. ఇక నుంచి ఊరిలో మన పరువు బాగా పెరిగిపోతుంది' అనుకుంటూ ఊహల్లో విహరిస్తూ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు వెంగళ్రావ్ ఉరఫ్ రాజ్.

★★★

రెండునెలల తరువాత... వెంగళ్రావ్ ఏ జిమ్‌కి వెళ్లకుండానే సన్నగా అయిపోయాడు. నిర్మల బాగా లావైపోయింది.

వెంగళ్రావ్ కుక్క మాత్రం వీధి కుక్కలతో కలసి వీధులవెంట తిరగసాగింది.

సినిమా డైరెక్టర్ ఇలా చాలామంది దగ్గర డబ్బు వసూలు చేసి సింగపూర్‌లో సెటిలైపోయాడు.

★



## స్టంట్ మేన్ ఫీట్

ఈజిప్టుకు చెందిన 20 ఏళ్ల రాగబ్ కోబ్రా అనే స్టంట్‌మేన్ ఇటీవల షార్మ్ ఎల్‌షైక్ అనే చోట టూరిస్టుల్ని ఆకట్టుకోవడానికి వందలాది మేకులు దిగకొట్టిన బల్ల చెక్కల మధ్యన తాను పడుకుని వాళ్లచేత మేకులు తొక్కించుకున్నాడు. అతను చేసిన ఈ సాహసోపేత ఫీట్‌ను చూసి ప్రదర్శనకొచ్చిన వాళ్లందరూ ఆశ్చర్యంతో ముక్కున వేలేసుకున్నారుట!

-తటవర్తి

